సాక్షి
వికారాబాద్
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



వలస నేతల ఖిల్లా!

విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు అడ్డా తాండూరు గడ్డ. తెలుగు, కన్నడ, ఉర్దూ భాషలకు నెలవు. 14లో▸



కాంగ్రెస్ వస్తే మేలు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. 15లో▸



నీరు వదలరాయే!

వేరుశనగ పంటకు కోట్‌పల్లి జలాశయం నుంచి నీరు వదలాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు. 15లో▸

కోవర్టుల దడ

అన్ని పార్టీల్లో అదే గుబులు

- కండువాలు మారుస్తున్న కొందరు నేతలపైనా అనుమానాలు
- పార్టీ మారినా కొనసాగిస్తున్న పాత పరిచయాలు
- ప్రైవేటు పీఏలదీ అదే బాట
- ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి
- బలం బలహీనతలు ప్రత్యర్థికి తెలుస్తాయనే భయం
- గోప్యతపై అభ్యర్థుల్లో ఆందోళన

వికారాబాద్/తాండూరు: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీలకు కోవర్టుల భయం పట్టుకుంది. తమ బలంతో పాటు బలహీనతలు ప్రత్యర్థులకు చేరుతున్నాయనే అనుమానాలతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గోప్యత పాటించాల్సిన అంశాలను బయటకు పొక్కకుండా చూడటం ఎలా అనే విషయంలో వారు ఆందోళనకు గురవుతున్నారు. ప్రత్యర్థి పార్టీల నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతో పాటు, తమ పార్టీలో ఉన్న నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం ఇప్పుడు కత్తిమీద సాములా మారింది. ఇలాంటి సమయంలో వ్యూహాలు.. ప్రతివ్యూహాలకు పదును పెడుతున్న పార్టీలు ఆ వ్యూహాలు పక్క పార్టీకి తెలియకుండా ఉండేందుకు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి వస్తోంది. ఒక్కోసారి ఎంత జాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా సమాచార బదిలీకి పాల్పడుతున్న కోవర్టులు పార్టీలకు దడపుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

గోప్యతపై అభ్యర్థుల్లో ఆందోళన

అభ్యర్థుల మధ్య గట్టిపోటీ కనిపిస్తున్న తరుణంలో ప్రధానంగా అభ్యర్థులు తమ గోప్యత విషయంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మీడియా సమావేశంలో తన ఆందోళనను బాహాటంగానే వెలిబుచ్చారు. ఉంటే ఉండండి.. లేదంటే వెళ్లి పోండి.. కానీ పార్టీలో ఉంటూ పార్టీకి ద్రోహం చేస్తే ఖబడ్దార్ అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీల్లో కోవర్టుల బెడదను చెప్పకనే చెప్పారనేది స్పష్టమవుతోంది. ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రధానంగా గతంలో తమకు పర్సనల్ అసిస్టెంట్లుగా పని చేసిన వ్యక్తులు తరువాత ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు పీఏలుగా వెళ్లడం, ఎన్నికల ముందు పార్టీలు మారిన వారిలో కొందరు ఇలా కోవర్టులుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఇలా జిల్లాలో పలు చోట్ల పలువురు గతంలో ఒక వైపు పని చేసి, ప్రస్తుతం ప్రత్యర్థుల దగ్గర పని చేస్తున్న దాఖలాలు బాగానే కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో తమ దగ్గర పీఏలుగా, డ్రైవర్లుగా పనిచేసి పక్క పార్టీకి తమ విషయాలు, వ్యూహాలు చేరవేసి తమకు వెన్నుపోటు పొడిచారనే కారణంతో అభ్యర్థులు తమ దగ్గర పనిచేసిన డ్రైవర్లను, పీఏలను మార్చిన ఘటనలు జిల్లాలో చాలానే ఉండటం గమనార్హం.



ఫిరాయింపు నేతలపైనా అనుమానాలు

పార్టీల్లో కోవర్టులు ఏ రూపంలో ఉంటారనేది ఎవరికి అర్థం కానప్పటికీ ప్రధానంగా కొందరిని నేతలు అనుమానిస్తున్నారు. ఇటీవల జిల్లాలో పార్టీ ఫిరాయింపులు బాగా పెరిగిపోయాయి. ఇలా ఒక పార్టీ నుంచి మరో పార్టీ గూటికి చేరుతున్న నేతలు ఏమైన మన వ్యూహాలు పక్క పార్టీ నేతలకు చెబుతారా? అని పార్టీలో చేర్చుకున్న వారితో పాటు గతంలో పనిచేసిన పార్టీల అభ్యర్థులు సైతం జంకుతున్నారు. ఫిరాయింపు నేతలతో పాటు సొంత పార్టీల్లోనే ఉంటూ అభ్యర్థులపై అసమ్మతి గళం వినిపిస్తూ వస్తున్న నేతలను సైతం అనుమానిస్తున్నారు. పార్టీలోనే ఉంటూ ప్రత్యర్థులకు ఉప్పందిస్తూ తమకేమైనా నష్టం చేస్తారా ? అనే ఆందోళన అభ్యర్థుల్లో రోజురోజుకూ పెరిగిపోతోంది.ఇదే సమయంలో తామున్న పార్టీ అభ్యర్థులతో పొసగక ఇటీవల అనేక మంది నేతలు, ప్రజా ప్రతిని ధులు పార్టీ మారడంతో పాటు ఇంకా మారుతూనే ఉన్నారు. ఇలా పార్టీలు మార్చిన వారు గత పార్టీ నేతలతో సన్నిహితంగానే ఉంటుండటం కూడా వారి పార్టీ ముఖ్యలను కలవరపెడుతోంది.

మద్దతు ఇవ్వండి

- ఆర్ కృష్ణయ్యను కోరిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ



ఆర్ కృష్ణయ్యతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: తాండూరు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికే బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆర్ కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న రోహిత్‌రెడ్డిని అభినందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన ఆర్ కృష్ణయ్య బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు. ప్రచారంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కోరగా ఆర్ కృష్ణయ్య సానుకూలంగా స్పందించారు.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ గెలుపునకు శ్రమిద్దాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేద్దామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండలం బుద్లాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాల స్థితిగతులు, మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, నాయకులు గోవర్ధన్‌గౌడ్, పండు, తుల్జానాయక్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కాసాని వీరేష్ ?

పరిగి టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం



పరిగి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. కొన్ని రోజులుగా కాసాని బీజేపీలో చేరి పరిగి నుంచి బరిలో దిగుతారనే ప్రచారం జరుగుతోంది. ఆయన రాజీనామా ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఏడాది నుంచి ఆయన తనయుడు కాసాని వీరేష్ పరిగిలో పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో పార్టీ ఆఫీసులు ప్రారంభించారు. పరిగి అసెంబ్లీ బరిలో ఉంటారనే ప్రచారం జరిగింది. అయితే తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయట్లేదని ప్రకటించింది. దీంతో కాసాని వీరేష్ బీజేపీ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఆయన కొంత కాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత ఉపాధి కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రెండు రోజుల్లో బీజేపీ మూడో జాబితా విడుదల కానుంది. ఆ లిస్టులో కాసాని వీరేష్ పేరు ఉంటుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కొండా, నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలనను అంతమొందించేందుకు ఇదే సరైన సమయమన్నారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసేందుకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, భీమేందర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, లక్ష్మీపతి యాదవ్, మండపా అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

శభాష్.. మల్లారెడ్డి

బహుజన సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక

షాబాద్: షాబాద్‌కి చెందిన యాస మల్లారెడ్డి బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యావేత్త, సామాజిక కార్యకర్తగా, తెలంగాణ ఉద్యమకారుడిగా, ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, పాత్రికేయ వృత్తిలో ఆయన చేసిన సేవలను గుర్తుంచి ఈ అవార్డు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో సోమవారం అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నాల్లా రాధాకృష్ణ, మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు. నవంబర్ 6న నగరంలోని అవార్డు అందించనున్నట్లు తెలిపారు.



కుల్కచర్ల రోడ్ షోలో మారుతికిరణ్, వెంకటయ్య

బీజేపీతోనే సుస్థిర పాలన

- కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపురం వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుల్కచర్ల, చాపలగూడెం, తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్, కుస్మసముద్రం, అనంతసాగర్, పుట్టపహడ్, అంతారం, బండవెల్కిచర్ల, రాంనగర్, సాల్వీడు, చెల్లాపూర్ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ నియంత పాలనలో ప్రజలు విసిగిపోయారని అన్నారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మైపాల్, చౌడపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శులు హన్మంతు, నర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మైపాల్, నాయకులు రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి నరోత్తంరెడ్డి



హస్తం పార్టీలో చేరుతున్న మంజుల, రమేష్



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నరోత్తంరెడ్డి తదితరులు

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి సోమవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మహంత్‌స్వామి, రాంనాథ్‌గుడుపల్లి ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి తదితరులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2014, 2018 సాధారణ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యహరించిన నరోత్తంరెడ్డి నాలుగు సంవత్సరాలుగా పార్టీకి దూరంగా ఉన్నారు. మండలంలో పార్టీని అన్ని తానై నడిపించిన ఆయన ఎమ్మెల్యే ఆనంద్‌తో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎట్టకేలకు బీఆర్‌ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి మంజుల, రమేష్

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ఆమె భర్త రమేష్, మరికొంత మంది బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సోమవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంజుల, రమేష్‌కుమార్, మోమిన్‌పేట్ సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, జే అరుణ్ కుమార్, రాఘవనాయక్, దీప్‌కుమార్‌లకు రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రసాద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుక రావాలని, ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని పీసీసీ అధ్యక్షుడు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు రత్నారెడ్డి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

- నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి
- నోడల్ అధికారులకు అన్ని అంశంపై అవగాహన తప్పనిసరి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్ అర్బన్: నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఎస్పీ కోటిరెడ్డితో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ 10వ తేదీ నాటికి ఫామ్ 6, ఫామ్ 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేయర్లు, ఖర్చుల పరిశీలన బృందాలు వారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. మద్యం దుకాణాలు, ప్రింటింగ్ ప్రెస్‌లపై నిఘా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోకల్ టీవీల్లో అనుమతులు లేకుండా ప్రకటనలు ఇస్తే కేసులు నమోదు చేయాలన్నారు. నామినేషన్ల రోజు ఇబ్బందులు తలెత్తకుండా రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశాన్ని వీడియో తీయాలని ఆదేశించారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిరంతరం నిఘా ఉంచాలని అన్నారు. సమావేశంలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాహుల్ శర్మ, విజయ్ కుమారి, శ్రీనివాసరావు, లింగ్యా నాయక్, నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి యాదయ్య

శంకర్‌పల్లి: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకే దక్కిందని చేవెళ్ల ఎమ్మెలే అభ్యర్థి కాలె యాదయ్య తెలిపారు. ప్రజాశీర్వాద యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల అబద్ధపు హామీలను నమ్మి ఆగం కావద్దని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు శశిధర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల అధ్యక్షుడు గోపాల్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ యువజన విభాగం నాయకుడు కాంతిరెడ్డి పాల్గొన్నారు.

ఉదయం కాంగ్రెస్‌లోకి..



సోమవారం ఉదయం ఉమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దొడ్ల సాయమ్మ

సాయంత్రం సొంతగూటికి..



సాయంత్రం బీఆర్‌ఎస్ కండువా కప్పుకుంటున్న పీఏసీఎస్ డైరెక్టర్ సాయమ్మ

దోమ: రాజకీయాల్లో ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఉదయం సొంత పార్టీలో ఉన్న వారు సాయంత్రం ప్రత్యర్థి పార్టీలో దర్శనమిస్తున్నారు. బుజ్జగింపులు సఫలీకృతం అయితే ఆ వెంటనే సొంత గూటికి చేరుతున్నారు. ఇలాంటి ఘటనే సోమవారం దోమ మండలంలో చోటుచేసుకుంది.బీఆర్‌ఎస్ తీరు నచ్చక పీఏసీఎస్ డైరెక్టర్ దొడ్ల సాయమ్మ ఉదయం మల్లేపల్లిలో డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాయంత్రం పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి మంతనాలు జరిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.దీంతో సాయమ్మ సాయంత్రం బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు.

మంత్రిగా ఏం చేశారో చెప్పండి

- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్యే ఆనంద్ ఫైర్
- మర్పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం



మర్పల్లి ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మర్పల్లి: వికారాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నిలదీశారు. సోమవారం మండలంలోని సిరిపురం, వీర్లపల్లి, కొత్లాపూర్, కోట్ మర్పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్ మర్పల్లి నుంచి ఎంపీటీసీగా, ఎంపీపీగా రాజకీయ ప్రస్తావన ప్రారంభించిన గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ మండలానికి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. స్థానికేతరుడైన ఆయనను ఈ ప్రాంత ప్రజలు ఆదరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేసినా నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోకు ప్రజల ఆదరణ లభించిందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. ప్రజలు మా వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తనను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరక్టర్ ప్రభాకర్‌గుప్తా, ఎంపీపీ లలిత, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు సోయేల్, ఆయా గ్రామాల సర్పంచులు మల్లయ్య, సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, మార్కెట్ డైరక్టర్ గౌస్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య, కొత్లాపూర్ నాయకులు నర్సింహారెడ్డి, రమేష్, రఘుపతిరెడ్డి, జైహిందొరెడ్డి తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

హెడ్ కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ జిల్లా పోలీస్ హెడ్‌కోటర్‌లో పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నర్సింలు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎన్‌సీసీతో సాంస్కృతిక అనుసంధానం

శంషాబాద్ రూరల్: ఎన్‌సీసీ కార్యకలాపాలతో దేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక అనుసంధానానికి ప్రోత్సాహం కలుగుతుందని ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ సంజయ్‌సాయల్ అన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ క్యాంపు ముగింపు వేడుకలను సోమవారం శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ నెల 21 నుంచి జరుగుతున్న ఈ శిబిరం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో పాల్గొన్న కేడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎన్‌సీసీ గ్రూపు నిర్వహించిన ఈ శిబిరంలో కేడెట్లకు గ్రూపు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు కల్నల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

వంద రోజుల్లో 'ఆరు గ్యారెంటీ'

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు మల్లయ్య, బుచ్చయ్య, సత్యం యాదవ్, మల్లేశ్‌గౌడ్, శ్రీను, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజా బలమున్నందునే పోరాటం


మాట్లాడుతున్న మేయర్ పారిజాత

కందుకూరు: తాము ప్రజల నుంచి వచ్చిన నాయకులం.. ప్రజా బలమున్నందునే కాంగ్రెస్ టికెట్ కోసం కొట్లాడుతున్నామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బైరాగిగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి తిరిగి ప్రజలకు భరోసా కల్పించామని కష్టపడినందునే కొట్లాడుతున్నామన్నారు. తన చివరి శ్వాస వరకు కాంగ్రెస్ కండువానే కప్పుకుంటానని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ప్రశాంతిరెడ్డి, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.పాండు, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, జంపన్నయాదవ్, రాఘవేందర్, సంతోషి, ఎండీ అఫ్జల్, సిద్ధు, అమృతనాయుడు, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, జ్యోతి, రాంరెడ్డి, వీరారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వలస నేతల ఖిల్లా!


మర్రి చెన్నారెడ్డి


మల్కుడ్ మాణిక్‌రావు


మల్కుడ్ చంద్రశేఖర్‌రావు


పట్నం మహేందర్‌రెడ్డి


మల్కుడ్ నారాయణరావు


పైలెట్ రోహిత్‌రెడ్డి

- నాలుగు దశాబ్దాలు పాలించిన మహారాజ్‌లు
- మూడు దశాబ్దాలుగా పట్నం హవా

తాండూరు: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు అడ్డా తాండూరు గడ్డ. తెలుగు, కన్నడ, ఉర్దూ భాషలకు నెలవు. ఎక్కడి నుంచి ఎవరొచ్చినా మర్యాదగా మాట్లాడటం, గౌరవించడం, ఆదరించడం ఇక్కడి ప్రజల సంప్రదాయం. ఏ ప్రాంతం నుంచి వచ్చిన వారు పోటీ చేసినా.. గెలిపించి అక్కున చేర్చుకుంటారు. అందుకే నియోజవకర్గం ఏర్పడిన నాటి నుంచి ఎక్కువ మంది వలస నేతలే తాండూరును ఏలారు.

వ్యాపారం కోసం కర్ణాటక నుంచి వచ్చిన మహారాజుల కుటుంబం ఆరు దశాబ్దాల పాటు ఇక్కడ రాజకీయ చక్రం తిప్పింది. తాండూరు అసెంబ్లీ స్థానం నుంచి తొలిసారి పోటీ చేసిన మర్రి చెన్నారెడ్డి మొదలుకుని.. మహరాజులు పట్నం మహేందర్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తమదైన ముద్ర వేశారు. అయితే తాండూరు అసెంబ్లీ నుంచి గెలిచిన ఇరు కుటుంబాలు షాబాద్ పేరుతో ముడిపడటం విశేషం. మహరాజుల కుటుంబానిది కర్ణాటకలోని షాబాద్ కాగా.. మహేందర్‌రెడ్డిది రంగారెడ్డి జిల్లా షాబాద్ కావడం విశేషం.

1956కు పూర్వం 16 జిల్లాలతో హైదరాబాద్ స్టేట్‌గా ఉండేది. రాష్ట్ర పునర్విభజన చట్టం 1956 ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియ తెరపైకి వచ్చింది. హైదరాబాద్ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించారు. కల్బుర్గి, బీదర్ జిల్లాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత కన్నడ భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విభజించడంతో అవి కర్ణాటకలో అంతర్భాగమయ్యాయి. హైదరాబాద్‌తో తాండూరుకు వీడదీయరాని బంధం ఉంది. కల్బుర్గి, వికారాబాద్ నాపరాతి నిక్షేపాలకు నిలయం. తాండూరు కందిపంట సాగుతో వ్యాపార సంబంధాలు కొనసాగేవి. ప్రాంతాలు విడిపోయినా సరిహద్దు ప్రజల మధ్య సత్సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

తాండూరు నియోజకవర్గంలో రాజకీయం విభిన్నం

నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

మండలం / పట్టణం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
పెద్దేముల్	18,527	19,312	01	37,840
కోట్‌పల్లి	2,879	3,043	-	5,922
తాండూరు	53,504	55,378	04	1,08,886
యాలాల	18,350	19,852	05	38,205
బషీరాబాద్	17,982	19,658	-	37,640
మొత్తం	1,11,242	1,17,243	10	2,28,495

కర్ణాటక రాష్ట్రం షాబాద్ ప్రాంతం మల్కాడ్‌కు చెందిన మహరాజుల కుటుంబం నాపరాయి వ్యాపారం కోసం తాండూరుకు వచ్చి బషీరాబాద్‌లో స్థిరపడింది. తమ వ్యాపారాన్ని విస్తరించి తాండూరుకు దేశ, విదేశాల్లో ఖ్యాతి తీసుకొచ్చారు. వ్యాపారంతో పాటు రాజకీయంలోనూ ఓ వెలుగు వెలిగారు.

ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ వేరుపడినా తాండూరు ప్రజలు మాత్రం వలస నేతలకు పట్టం కడుతూనే వచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా వ్యాపారం కోసం ఇక్కడికి వలస వచ్చిన వారే కావడం విశేషం. కాల క్రమంలో ఇక్కడే స్థిరపడినప్పటికీ పూర్వాశ్రమంలో సదరు నేతలంతా స్థానికేతరులే కావడం గమనార్హం. అయినప్పటికీ ఇక్కడి ప్రజలు వీరికి రాజకీయ పట్టం కట్టడం విశేషం.

ప్రజలతో మమేకమైన వలస నేతలంతా అంచలంచెలుగా రాజకీయాలపై పట్టు సాధించారు. రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రంలో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నారు. జాతీయ స్థాయి నేతలుగా గుర్తింపు తెచ్చుకొన్నారు. ఇందులో ప్రధానంగా దివంగత ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన మల్కాడ్ మాణిక్‌రావు, చందుమహరాజ్, పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు.

తాండూరు నుంచే మర్రి ప్రస్థానం

తాండూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసిన విజయం సాధించిన మర్రి చెన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పని చేశారు. తాండూరు నియోజవకర్గం నుంచి రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. తాండూరు అసెంబ్లీ ఏర్పడిన తర్వాత తొలిసారిగా మర్రి చెన్నారెడ్డి 1962లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తిరిగి 1967లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. మర్రి చెన్నారెడ్డి స్వగ్రామం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల వాసి కావడం విశేషం.

మహరాజుల నేపథ్యం..

తాండూరు అసెంబ్లీకి మల్కాడ్ మాణిక్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి స్ఫూర్తితో మాణిక్‌రావు రాజకీయాల్లోకి వచ్చారు. మాణిక్‌రావు తండ్రి నర్సప్పది కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని మల్కాడ్ గ్రామం, శతాబ్దం క్రితమే నర్సప్ప నాపరాతి వ్యాపారం నిమిత్తం బషీరాబాద్‌కు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. చెన్నారెడ్డితో పరిచయమైన మాణిక్‌రావు కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ రాజకీయాల్లో పట్టు సాధించారు. మాణిక్‌రావు కుటుంబానికి జిల్లా ప్రజల్లో మహరాజులుగా పేరు వచ్చింది. 1960లో రాజకీయాల్లోకి వచ్చిన మాణిక్‌రావు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 14 ఏళ్ల పాటు రాష్ట్ర మంత్రి వర్గంలో పలు శాఖలు చేపట్టి మంత్రిగా కొనసాగారు. తర్వాత ఆయన సోదరుడు దివంగత మంత్రి చంద్రశేఖర్‌రావు(చందుమహరాజ్) రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా ఉన్న సమయంలో గుండెపోటుతో మరణించారు. తర్వాత మరో సోదరుడు నారాయణరావు 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు.

షాబాద్ నుంచి 'పట్నం'


దివంగత హోం మంత్రి ఇంద్రారెడ్డి మేనల్లుడు.. పట్నం మహేందర్‌రెడ్డి. తాండూరు అసెంబ్లీకి 6 సార్లు పోటీ చేసి 4సార్లు విజయం సాధించారు. 1994లో రాజకీయ అరంగేట్రం చేసిన ఆయనది చేవెళ్ల పరిధిలోని షాబాద్ మండలం గొల్లూరుగుడ స్వగ్రామం. మేనమామ ప్రోద్బలంతో టీడీపీలో చేరి రాజకీయాల్లో ఎదిగారు. 1994లో మహరాజుల కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు తలెత్తడంతో మాణిక్‌రావు, నారాయణరావు బరిలో నిలిచారు. దీంతో అనూహ్యంగా మహేందర్‌రెడ్డిని విజయం వరించింది. దీంతో మహరాజుల కోట మహేంద్రుడి వశమైంది.

తొలి స్థానికుడిగా పైలెట్..

బషీరాబాద్ మండలం ఇందర్‌చెడ్ గ్రామానికి చెందిన పైలెట్ రోహిత్‌రెడ్డి 2008లో రాజకీయాల్లోకి వచ్చారు. పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. రాజకీయాలపై ఆసక్తితో తాండూరుకు వచ్చి తొలి నాళ్లలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. 2009లో మనపార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరి టికెట్ ఆశించి భంగపడ్డారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగి మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. అనంతరం టీఆర్ఎస్‌లో చేసి ప్రస్తుతం అధికార పార్టీ తరఫున ఎమ్మెల్యే బరిలో ఉన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ..

కాంగ్రెస్ నుంచి తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం మరోసారి ఇద్దరు వలస నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారు. వీరిలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పరిగి నియోజవకర్గానికి చెందిన డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి ఉన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది. గత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థే గెలుపొందిన నేపథ్యంలో టికెట్ కోసం ఇరువురు నేతలూ ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తున్నారు.



తాండూరు అసెంబ్లీ మ్యాప్

ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు..

ఎమ్మెల్యే పేరు	సంవత్సరం	పార్టీ
మర్రి చెన్నారెడ్డి	1962	నేషనల్ కాంగ్రెస్
మర్రి చెన్నారెడ్డి	1967	నేషనల్ కాంగ్రెస్
మల్కుడ్ మాణిక్‌రావు	1972	నేషనల్ కాంగ్రెస్
మల్కుడ్ మాణిక్‌రావు	1978	నేషనల్ కాంగ్రెస్
మల్కుడ్ మాణిక్‌రావు	1983	నేషనల్ కాంగ్రెస్
మల్కుడ్ చంద్రశేఖర్‌రావు	1985	నేషనల్ కాంగ్రెస్
మల్కుడ్ చంద్రశేఖర్‌రావు	1989	కాంగ్రెస్
పట్నం మహేందర్‌రెడ్డి	1994	టీడీపీ
పట్నం మహేందర్‌రెడ్డి	1999	టీడీపీ
మల్కుడ్ నారాయణరావు	2004	కాంగ్రెస్
పట్నం మహేందర్‌రెడ్డి	2009	టీడీపీ
పట్నం మహేందర్‌రెడ్డి	2014	టీఆర్ఎస్
పైలెట్ రోహిత్‌రెడ్డి	2018	కాంగ్రెస్

పార్టీలే వేరు.. ప్రత్యర్థులు వారే

- మూడో పర్యాయంలో త్రిముఖ పోటీ
- ఆసక్తికరంగా మారిన చేవెళ్ల సెగ్మెంట్ ఎన్నికలు

మొయినాబాద్: జిల్లా పరిధిలోని చేవెళ్ల నియోజకవర్గ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్శిస్తున్నాయి. మూడు పర్యాయాలుగా ప్రస్తుత ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ప్రత్యర్థులుగా కొనసాగుతున్నారు. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానమవ్వడంతో టీడీపీ నుంచి కేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య పోటీ చేయగా 2,249 ఓట్ల మెజారిటీతో రత్నం గెలుపొందారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రత్నం 'సైకిల్' దిగి 'కారె'క్కారు. అనంతరం 2014 ఎన్నికల్లో కేఎస్ రత్నం టీఆర్ఎస్ నుంచి పోటీచేయగా కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య బరిలో దిగారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో రత్నంపై యాదయ్య 781 ఓట్లపై 'చేయి' సాధించారు. ఆ తదనంతరం ఆయన 2015లో హస్తంను వీడి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. 2018 ఎన్నికల్లో కారు టికెట్ కాలెకు దక్కడంతో కేఎస్ కాంగ్రెస్‌లో చేరి బీఫాం తీసుకున్నారు. ఈ ఎన్నికలో యాదయ్య 33,747 ఓట్ల మెజార్టీతో గెలుపొందరు. కాంగ్రెస్ నుంచి ఓడిన రత్నం కొంతకాలనికే మళ్లీ గులాబీ బాటలో నడిచారు. 2023లోనూ బీఆర్ఎస్ నుంచి కాలె యాదయ్యకు టికెట్ వరించగా.. కాంగ్రెస్ స్థానిక నాయకుడు పామెన భీంభరత్‌కు అవకాశం ఇచ్చింది. కాగా రత్నం ఇటీవలే తన అనుచరులతో కమలం గూటికి చేరారు. బీజేపీ టికెట్ ఆయనకే దక్కే అవకాశం ఉంది. మూడు పర్యాయాలుగా ప్రత్యర్థులుగా ఉన్న వారు ఈ ఎన్నికలో త్రిముఖ పోటీ ఎదుర్కునే అవకాశాలు కనిపిస్తున్నాయి.


ఎమ్మెల్యే కాలె యాదయ్య


మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

'సైకిల్' దిగిన సీనియర్ నేత

టీడీపీకి గుడ్‌బై చెప్పిన పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుభాష్‌యాదవ్

మర్పల్లి: టీడీపీ ఆవిర్భావం నుంచి కండువా కప్పుకుని పనిచేస్తూ అంచలంచలుగా ఎదిగిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుభాష్‌యాదవ్ సైకిల్ దిగి హస్తం గూటికి చేరారు. సోమవారం ఆయన తన అనుచరులతో కలిసి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సుభాష్ యాదవ్ మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్-2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైరమన్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి రఘుపతిరెడ్డి తదితరులురు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవినాయక్ సైతం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


సుభాష్‌యాదవ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

పార్టీకి కాదు.. పదవికి రాజీనామా చేయాలి

చైర్‌పర్సన్ తీరుపై మండి పడిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు


మాట్లాడుతున్న కౌన్సిలర్లు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ చిత్తశుద్ధి తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రెండున్నరేళ్ల ఒప్పందంలో భాగంగా చైర్‌పర్సన్ పదవి చేపట్టిన ఆమె మాట తప్పిందని ఆరోపించారు. ఒప్పందం ప్రకారం కుర్చీ దిగమన్నందుకు ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తూ పార్టీకి రాజీనామా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు పుష్పలతారెడ్డి, రాజలక్ష్మి, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న మల్లేశం

వికారాబాద్ అర్బన్: ఓటే ప్రజల వజ్రాయుధమని.. దానిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకుని మంచి పాలకులను ఎన్నుకోవలని స్వీప్ నోడల్ అధికారి మల్లేశం అన్నారు. సోమవారం స్థానిక విశ్వభారతి డిగ్రీ కళాశాలలో స్వీప్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. నవంబర్ 30న నిర్వహించే పోలింగ్‌లో ఓటు హక్కు ఉన్నవారంతా తప్పక వినియోగించుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధువుల సైతం ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కోటాజీ, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు న్యాయం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే నిరుద్యోగులకు న్యాయం చేకూరుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం వారు మండల పరిధిలోని ఘనపూర్‌లో ఆరు గ్యారెంటీలపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఎన్నికల స్టంట్ మాత్రమే అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్ కుమార్‌రెడ్డి, నాయకులు స్వామి, కృష్ణయ్య, సోమలింగం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో భీంరెడ్డి, ఆంజనేయులు తదితరులు

మంచినీళ్ల బావి తండాలో..

చౌడాపూర్ మండల పరిధిలోని మంచినీళ్ల బావి తండాలో కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ కాంగ్రెస్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


పరిగి: రొట్టెలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి


బంట్వారం: కోట్‌పల్లి మండలం ఎన్నారంలో ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి సబిత ప్రచారం


ధారూరు: తరిగోపులలో గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య ఇంటింటి ప్రచారం

ప్రచారం.. కుటుంబ సమేతం!

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల కుటుంబ సభ్యులు జోరు పెంచారు. అభ్యర్థుల తరఫున సతీమణులు, కూతుళ్లు ఇంటింటికీ తిరుగుతూ మద్దతివ్వాలని కోరుతున్నారు. పార్టీల మేనిఫెస్టోలు వివరిస్తూ వారితో కలిసిపోతున్నారు.